ఆగని ఏనుగుల దాడులు

పాకాల: మండలంలో పలు గ్రామాల్లో ఏనుగులు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. తాజాగా సోమవారం రాత్రి ఈ–పాలగుట్టపల్లి, వరదప్పనాయుడుపేట, చంద్రగిరివారిపల్లి గ్రామాల్లో సోమవారం రాత్రి ఏనుగులు పంట పొలాలపై దాడికి తెగబడ్డాయి. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక రైతులు మాట్లాడుతూ ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి కొబ్బరిచెట్లు, మామిడి తోటలను ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వన్యప్రాణులపై వేటకుక్కల పంజా

వన్యప్రాణి వేటగాళ్లు కొత్త దారులు కనిపెడుతున్నారు. గతంలో తుపాకులతో వేటాడేవాళ్లు తాజాగా కుక్కలను తమ వేటకు ఉపయోగించుకుంటున్నారు. వన్యప్రాణులను వేటాడేలా కుక్కలకు తర్ఫీదు ఇచ్చి వన్యప్రాణులను చంపుతున్నారు. పనపాకం పరిసర ప్రాంతాల్లో ఈ తరహా వేట పరిపాటిగా మారింది. అటవీ అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో తరచూ దుప్పులు తదితర వన్యప్రాణులు బలవుతున్నాయి. వేట కుక్కల వరుస దాడుల్లో మూగజీవాలు ప్రాణాలను పోగొట్టుకుంటున్నాయి. – చంద్రగిరి

- మూగ జీవులను వేటాడేలా శునకాలకు తర్ఫీదు
- మూడు రోజుల క్రితం చుక్కల దుప్పి మృతి
- తాజాగా మరో దుప్పిని వేటాడిన వేట కుక్కలు
- వారం రోజుల క్రితం ఓ ఆవు దూడపై దాడి



వేట కుక్కల దాడిలో గాయపడి పశువుల దొడ్డిలోకి దూరిన చుక్కల దుప్పి, గాయపడిన దుప్పిని చికిత్స నిమిత్తం తరలిస్తున్న అటవీ సిబ్బంది

మూడు రోజుల క్రితం వేట కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పి మృతి చెందిన ఘటన మరువకముందే తాజాగా మంగళవారం మరో దుప్పిని వెంటాడాయి. దుప్పిపై మూకుమ్మడిగా దాడి చేశాయి. ప్రాణభయంతో ఆ దుప్పి గ్రామంలోని ఓ ఇంట్లోని పశువుల దొడ్డిలోకి రావడంతో గ్రామస్తులు దానిని రక్షించారు. పనపాకం పంచాయతీలో వేట కుక్కల ద్వారా వన్య ప్రాణులను వేటాడేది ఇటీవల ఎక్కువైంది. పంచాయతీలోని గడ్డం వారిపల్లి, అరిగెలవారిపల్లి, పేట గ్రామాలకు చెందిన కొంత మంది వ్యక్తులు కుక్కలకు వేటాడేలా తర్ఫీదు వచ్చి అటవీ జంతువులపై ఉసి గొల్పుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మంగళవారం గడ్డంవారిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న చుక్కల దుప్పి కుక్కలు తరమడంతో ఓ పశువుల పాకలో తలదాచుకుంది. వెంటనే గ్రామస్తులు స్పందించి తరిమే సమయంలో కుక్కలు వారిపై కూడా దాడికి యత్నించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఎలాగోలా దుప్పిని రక్షించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న అధికారులు గాయాలపాలైన దుప్పిని చికిత్స నిమిత్తం వాహనంలో తీసుకెళ్లారు. చికిత్స అనంతరం మధ్యాహ్నం సమయంలో సురక్షితంగా అడవిలో వదిలినట్లు తెలిపారు.

15 రోజుల క్రితం వేట కుక్కలు స్వాధీనం

అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులను వేటాడేందుకు తమిళనాడు నుంచి వేట కుక్కలతో అరిగెలవారిపల్లికి చేరుకున్న ఇద్దరిని అటవీ అధికారులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రెండు వేట కుక్కలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వారి విచారణలో కుక్కలకు వేటాడేందుకు శిక్షణ కోసం తీసుకొచ్చినట్లు అధికారులు గుర్తించారు. అయితే వారిపై నామమాత్రపు చర్యలు తీసుకుని, విడుదల చేశారు. ఆనాటి నుంచి ఇలా వేట కుక్కలు వన్యప్రాణులపై దాడులకు పూనుకున్నాయి. ఇందులో ఓ అటవీ అధికారి ప్రమేయం ఉన్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, వేట కుక్కల యజమానులతో పాటు వారికి పరోక్షంగా సహకరిస్తున్న అటవీ అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం

వన్యప్రాణులపై వేట కుక్కలు దాడులు చేస్తున్నాయనడం కేవలం ఆరోపణలు మాత్రమే. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరం. కుక్కల దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లోని ప్రజలకు వీటిపై అవగాహన కల్పిస్తాం. ఇటువంటి ఘటనలు పునరావృతం అయితే కుక్కల యజమానులపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం.
– మాధవి, అటవీశాఖ అధికారి, పనపాకం

పంచాయతీ కార్యదర్శిపై జెడ్పీ సీఈఓ ఆగ్రహం


రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

తిరుపతి రూరల్: విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా ఉండడమే కాకుండా, పంచాయతీలో రికార్డులను సక్రమంగా నిర్వహించని చెర్లోపల్లి పంచాయతీ కార్యదర్శి బాబునాయుడుపై జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లిలోని పంచాయతీ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో అధికారికంగా ప్రతి రోజూ నిర్వహించాల్సిన రికార్డులు సక్రమంగా లేకపోవడంపై మండిపడ్డారు. జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ సమయంలో పంచాయతీ కార్యదర్శి బాబునాయుడు సచివాలయంలో లేకపోవడంపై అసహ నం వ్యక్తం చేశారు. నెలల తరబడి వలంటీర్ల సంతకాలు రికార్డుల్లో లేకపోవడంపై ఆశ్చర్యం వెలిబుచ్చారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని మండిపడ్డారు. వారిపై చర్యలు చేపట్టాలని తిరుపతి రూరల్ ఎంపీడీఓ, తిరుపతి జిల్లా డీఎల్‌డీఓకు సిఫారసు చేశారు.

బంగారు గొలుసు అప్పగింత

తిరుమల : ఎస్‌ఎంసీ ఏరియాలోని భక్తురాలు మరిచిపోయి వెళ్లిన బంగారు గొలుసును పారిశుద్ధ్య సిబ్బంది తిరిగి అప్పగించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మహారాష్ట్ర కొల్హాపూర్‌కు చెందిన మాధురి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకున్నారు. ఎస్‌ఎంసీ ఏరియాలో 211 సీ గదిని అద్దెకు తీసుకున్నారు. మంగళవారం గదిని ఖాళీచేసి వెళ్లిపోయారు. గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన పారిశుద్ధ్య సిబ్బంది బంగారు నల్లపూసల దండను గుర్తించి, ఎస్‌ఎంసీ ఎంక్వైరీ కార్యాలయ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఆభరణాన్ని భక్తురాలికి అందజేశారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో అన్నమయ్య జిల్లా, కలికిరి మండలం, వాడవాండ్ల పల్లికి చెంది ప్రస్తుతం తిరుపతి ఎల్‌బీనగర్‌లో నివసిస్తున్న బీ.వినోద్‌కుమార్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు.

నకిలీ టికెట్లు పొందిన వ్యక్తిపై కేసు

తిరుమల: నకిలీ ఐడీ కార్డులతో లక్కీడిప్‌లో శ్రీవారి సుప్రభాతసేవను పొందిన వ్యక్తిపై తిరుమల టూటౌన్ పోలీసులు కేసును నమోదుచేశారు. విజయవాడకు చెందిన రసూల్ టీటీడీ లక్కీడిప్‌లో నకిలీ ఆధార్‌కార్డుల ద్వారా పాల్గొనేవాడు. ఆ విధంగా పొందిన టికెట్‌తో దర్శనానికి వచ్చిన అతడిని టీటీడీ విజిలెన్స్ అధికారులు గుర్తించారు. అతని వద్ద నుంచి నకిలీ ఐడీలను స్వాధీనం చేసుకుని తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే


పాకాల అంబేడ్కర్ భవన్‌లో జ్యోతిరావు పూలేకు నివాళి


పూలేకి నివాళులర్పిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ

పాకాల: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, అణగారిన జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు జ్యోతీరావు పూలే అని అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జ్యోతీరావుపూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భవన కమిటీ సభ్యులు మొగిలప్ప, శివప్రసాద్, గోపాలయ్య, నరసింహులు, ఎంఈఓ బాబ్జీ, రామయ్య, ప్రభు, విజయమోహన్‌రెడ్డెప్ప, రాజేంద్రుడు పాల్గొన్నారు.

పూలేకి మేయర్, డిప్యూటీ మేయర్ల నివాళి

తిరుపతి కల్చరల్: పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ చాంబర్‌లో పూలేకి మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ పుష్పాంజలి ఘటించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



లెజిస్లేచర్ సెక్రటేరియట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం లెజిస్లేచర్ సెక్రటేరియట్ చైర్మన్, కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, సినీనటి దివ్య బాలకృష్ణ, సినీ నటుడు సాయిధర్మతేజ, సింగర్ విజయ్‌ప్రకాష్, అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడి అభయం



చంద్రగిరి: బంగారు తిరుచ్చిపై రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం శ్రీకృష్ణ స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేక సేవ చేపట్టి, స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితులైన స్వామి, అమ్మవార్లు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్‌ఎస్‌ఐ తిరుపతి చాప్టర్‌కు జాతీయ అవార్డు


జాతీయ అవార్డు అందుకుంటున్న పీఆర్‌ఎస్‌ఐ తిరుపతి చాప్టర్ చైర్మన్ శ్రీనివాసరావు

తిరుపతి కల్చరల్: ప్రజా సంబంధాల వ్యాప్తి కోసం ఉత్తమ కార్యక్రమాలు నిర్వహించినందుకు పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్‌కు జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని జన్‌పథ్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం 45వ అంతర్జాతీయ ప్రజా సంబంధాల ఉత్సవం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ డాక్టర్ సోనాల్ మాన్‌సింగ్ చేతుల మీదుగా ఈ అవార్డును తిరుపతి చాప్టర్ చైర్మన్ శ్రీనివాసరావు అందుకున్నారు. ఈ కార్యక్రమలంలో విదేశీ వ్యవహారాల శాఖ అంబాసిడర్ రాజశేఖర్, పీఆర్‌ఎస్‌ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాథక్, ఉపాధ్యక్షుడు యూఎస్ శర్మ, సెక్రటరీ జనరల్ పీఎల్‌కే మూర్తి పాల్గొన్నారు. ఈ అవార్డు రావడంపై టీటీడీ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ టి.రవి, పీఆర్‌ఎస్‌ఐ తిరుపతి చాప్టర్ వ్యవస్థాపక చైర్మన్ సి.రమాకాంత శర్మ, కార్యదర్శి డి.చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్‌రావు కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్, మాజీ చైర్మన్లు స్వరాజ్యలక్ష్మి, ఎన్‌బీ.సుధాకర్‌రెడ్డి ఎన్‌బీ.హర్షవర్ధన్‌రెడ్డి, ఆర్‌సీకే.రాజు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఆహార నాణ్యత పాటించకుంటే చర్యలు


నిల్వ ఉంచిన ఆహారాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుపతి కల్చరల్: తిరుపతి పుణ్యక్షేత్రంలోని హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో విక్రయించే ఆహారంలో నాణ్యత పరమైన ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మద్దిలేటి హెచ్చరించారు. లక్ష్మీపురం సర్కిల్ వద్దనున్న బార్బిక్యూ నేషన్, మరో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో నాణ్యత లేకుండా ఆహారం అమ్ముతున్నారనే ఫిర్యాదు రావడంతో మంగళవారం తనిఖీలు చేపట్టారు. హోటల్లోని వంట గదులను తనిఖీ చేసి, పాచిన పదార్థాలు, వారం రోజుల క్రితం నుంచి ఫ్రిజ్‌లో ఉంచిన మాంసం స్వాధీనం చేసుకొని ల్యాబ్‌కు తరలించారు. సంబంధిత హోటల్స్‌కు నోటీసులు జారీ చేసి జరిమానా విధించారు. వెటర్నరీ అధికారి డాక్టర్ నాగేంద్రరెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సురక్ష..శ్రీరామరక్ష

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి రోగులను గుర్తించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆయా సచివాలయాల పరిధిలో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్తులకు నిపుణులైన వైద్యులతో చికిత్సలందించింది. తొలివిడతగా మొత్తం 45 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా వైద్యశిబిరాలు నిర్వహించింది. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు.. అవసరమైన వారికి శస్త్రచికిత్సలను సైతం చేయించింది. దేశంలోనే తొలిసారిగా విప్లవాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే.. – పాకాల


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)

ఇంటికే మందులు



తీవ్రమైన నడుము నొప్పుతో బాధపడేదాన్ని ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద వైద్యశిబిరంలో చికిత్స చేయించుకున్నా. ఏఎన్‌ఎంలు ప్రతి నెలా మా ఇంటికే వచ్చి మందులు ఇస్తున్నారు. హెల్త్ క్యాంపులో ఉచితంగానే అన్నిరకాల పరీక్షలు చేశారు. ఈ పథకంతో పేదలకు ఎంతో ఉపయోగం.
– అన్నపూర్ణ, మొగరాల పంచాయతీ, పాకాల మండలం

జనవాక్కు

ఉచితంగా వైద్య పరీక్షలు



ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో సాధారణ వైద్య సేవలతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందజేశారు. గతంలో ఇలాంటి కార్యక్రమాన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన పథకం ఎంతో ఉపయోగకరం.
– హుస్సేన్‌బీ, మొగరాల, పాకాల మండలం

అసమానతల నిర్మూలనకు పూలే కృషి


పూలేకు నివాళి అర్పిస్తున్న ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వీఎన్ బాబు, సుబ్బరాజు, ఉద్యోగులు

తిరుపతి రూరల్: సమాజంలో అసమానతల నిర్మూలనకు మహాత్మా జ్యోతిబా పూలే ఎనలేని కృషి చేశారని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వీఎన్ బాబు, సుబ్బరాజు పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు, నిమ్న కులాల ప్రజలకు ఎదురయ్యే సాంఘిక దుశ్చర్యలపై జ్ఞానోదయాన్ని కల్పించేందుకు పూలే ఎనలేని కృషి చేశారన్నారు. చీఫ్ జనరల్ మేనేజర్లు లక్ష్మీనరసయ్య, గురవయ్య, జాయింట్ సెక్రటరీ రాధాజయశ్రీ, జనరల్ మేనేజర్లు గోపాలకృష్ణ, సురేంద్రరావు, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు చలపతి, జగదీష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: ఓటు ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అని, 1-1-2024 నాటికి 18ఏళ్లు నిండిన ప్రతి ఒకరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయించుకోవడం బాధ్యత అని తిరుపతి జిల్లా ఇన్‌స్టిట్యూషనల్ నోడల్ ఆఫీసర్, ఆర్ఐఓ జీ.వీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలల్లో మంగళవారం ఓటు నమోదుపై 18ఏళ్లు నిండిన విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు ఉన్నాయి.. తొలగించండి

తిరుపతి అర్బన్: జిల్లాలో ఏదో జరిగిపోతోందంటూ టీడీపీ నేతలు మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డిని కలిశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో దొంగ ఓట్లు ఉన్నాయని వాటిని తొలగించాలంటూ ఓ వినతిపత్రాన్ని అందజేశారు. టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహా యాదవ్, నాని, శ్రీధర్ వర్మ పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్ ఎన్నికల విధులకు ఈఎంసీ సీఈవో



వి.కనకనరసారెడ్డి

తిరుపతి అర్బన్: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గం పరిశీలకులుగా తిరుపతి క్లస్టర్ ఈఎంసీ సీఈవో వి. కనకనరసారెడ్డిని కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్(ఈఎంసీ) సీఈవోగా పనిచేస్తున్న వి.కనకనరసారెడ్డి డిసెంబర్ 4వ తేదీ అధికారికంగా ఫలితాలను వెల్లడించే వరకు అక్కడే విధులు నిర్వహించనున్నారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

తిరుపతి అర్బన్: ఓటర్లకు సంబంధించి న్యాయబద్ధమైన అభ్యంతరాలుంటే తెలియజేస్తే వాటికి పరిష్కారం చూపుతామని తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆర్డీవో కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి వారం ఎస్ఎస్ఆర్ -2024 పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఉంటుందని చెప్పారు. ఫారం 6, 7, 8 పై క్షేత్రస్థాయిలో పరిశీలించిన వివరాలు, డూప్లికేట్, ఫొటో సిమిలర్ ఓటర్ల జాబితాపై చేపట్టిన చర్యలు వివరించారు.ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు వైఎస్ఆర్ సీపీ, బీజేపీ, బీఎస్పీ ప్రతినిధులు, డెప్యూటీ తహశీల్దార్ అశోక్‌రెడ్డి, ఎన్నికల డీటీ మునిశైలజ పాల్గొన్నారు.

భూములు కోల్పోయినవారు నష్టపరిహారం తీసుకోండి

పాకాల/చంద్రగిరి: నియోజకవర్గం పరిధిలో ఎన్‌హెచ్ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన బాధితులు నష్టపరిహారం తీసుకోవాలని తహసీల్దార్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం జేసీ ఆదేశాల మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ 3డి నోటిఫికేషన్ ద్వారా ఎన్‌హెచ్140 కుక్కలపల్లి-మల్లవరం 6 లైన్ల రోడ్డు నిమిత్తం గతంలో భూసేకరణ చేసినట్లు తెలిపారు. చాలా వరకు భూమి కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించామని, కొంత మంది భూమి కోల్పోయిన యజమానులు నష్టపరిహారం తీసుకోలేదని వివరించారు. ఇంకా నష్టపరిహారం తీసుకోని భూయజమానులు సంబంధిత భూమి పత్రాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నవంబర్ 15వ తేదీలోపు చేర్చాలన్నారు. నష్టపరిహారం తీసుకోని పక్షంలో ఎన్‌హెచ్ యాక్ట్ 1956 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

ఖాతాదారులకు రెప్కో బ్యాంకు విశిష్ట సేవలు



చెక్కును అమిత్‌షాకు అందిస్తున్న అధికారులు

తిరుపతి అలిపిరి: భారత ప్రభుత్వంచే స్థాపించబడి హోం శాఖ-పునరావాస మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గడిచిన 55 ఏళ్లగా తమ ఖాతాదారులకు విశిష్ట సేవలను అందిస్తున్నామని రెప్కో బ్యాంక్ చైర్మన్ ఇ.సంతానం, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ఎస్.ఇసబెల్లా తెలిపారు. బ్యాంకు 55వ వ్యవస్థాపక వార్షికోత్సవం సందర్భంగా వారు మాట్లాడారు. 2022-23 సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వానికి 20 శాతం(రూ.15.26 కోట్లు) డివిడెండ్ చెక్కును కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు అందించినట్లు పేర్కొన్నారు. తిరుపతిలోని గోవిందరాజు స్వామి ఆలయం వద్ద ఉన్న రెప్కో బ్యాంక్ చీఫ్ మేనేజర్ తెన్నావన్ మాట్లాడుతూ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక డిపాజిట్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు రెప్కో బ్యాంక్‌లోగాని.. ఫోన్ నంబర్లు 0877-2258802, 78239 78410, 94901 81510 సంప్రదించవచ్చని వివరించారు.

మీ కడుపు మంట కూతలు.. రాతలు ఆపండి

- తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయిస్తే తప్పేమిటి..?
- అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి
- సమావేశంలో అఖిలపక్ష నేతలు, జర్నలిస్టులు, మేధావులు



ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వక్తలు, జర్నలిస్టులు, మేధావులు

తిరుపతి మంగళం: అమ్మా పెట్టా పెట్టదు, అడుక్కోనివ్వదు అనే సామెత చందంగా ఎల్లో మీడియా, బీజేపీపై అఖిలపక్షం ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు ఖర్చు చేయడం తప్పనే విధంగా విషప్రచారం చేస్తున్న వారిపై మండిపడ్డారు. టీటీడీ నిధులతో తిరుపతి అభివృద్ధి అనే అంశంపై ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో పారిశుద్ధ్య పనులు చేపట్టి క్లీన్ అండ్ హెల్త్ సిటీగా తీర్చిదిద్దాలన్న నగర కార్పొరేషన్ ఆశయానికి టీటీడీ చేయూతనివ్వడాన్ని ఎల్లో మీడియా, బీజేపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్న విషయం తెలిసిందే. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు ఖర్చు చేయడం సమంజమేనని స్పష్టం చేశారు. దీనిపై కడుపు మంట మాటలు, రాతలు ఆపాలని అఖిలపక్ష నేతలు హెచ్చరించారు. తిరుపతిలో పారిశుద్ధ్య పనులకు టీటీడీ నిధులు సమకూరుస్తుంటే మీడియాగా స్వాగతించాల్సింది పోయి, కడుపు మంటను ప్రదర్శించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. తిరుపతిని అభివృద్ధి చేస్తే తాము ఊరుకునేది లేదన్నట్టుగా ఎల్లో రాతలున్నాయని ధ్వజమెత్తారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అఖిలపక్షం సమావేశంలో ఎవరెవరు ఏమి అన్నారో చూద్దాం..

40 శాతం టీటీడీ నిధులు ఇచ్చినా తక్కువే...



తిరుపతిలో నివసించే ప్రతి ఒక్కరు పార్టీలకు అతీతంగా అభివృద్ధిని స్వాగతించాలి. తిరుపతి అభివృద్ధికి టీటీడీ 40శాతం నిధులు ఇచ్చినా తక్కువే అవుతుంది. తిరుపతిలో టీటీడీకి చెందిన అనేక ఆసుపత్రులు, స్కూల్స్, కళాశాలలు ఉన్నాయి. శ్రీనివాససేతు ఫ్లైఓవర్ నిర్మించారు. శ్రీవారి భక్తులకు తిరుపతిలో సౌకర్యాలు కల్పించి, పరిశుభ్రంగా ఉంచడం అంత సులభతరమైతే కాదు. అందుకు టీటీడీ నిధులు కేటాయించడాన్ని టీడీపీ స్వాగతిస్తోంది.

– చినబాబు, టీడీపీ అధికార ప్రతినిధి

చరిత్రలో నిలిచిపోయేలా తిరుపతి అభివృద్ధి



ఇరవయ్యేళ్లల్లో ఎన్నడూ చూడనంతగా తిరుపతి అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ నలుమూలల నుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చే వారు సైతం తిరుపతి అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోతున్నారు. శ్రీవారి భక్తుల తాకిడితో తిరుపతి నగరంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంటోంది. టీటీడీ 1శాతం నిధులు ఎంతో అవసరం. టీటీడీ నిధులు రాకుండా అడ్డుపడ్డుతున్న బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డికి తిరుపతి అభివృద్ధి ఇష్టం లేనట్టుగా ఉంది.

– రామస్వామి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్

కల్యాణి డ్యామ్ నీళ్లు టీటీడీ ఎలా వాడుకుంటుంది?



తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు ఇవ్వకూడదని బీజేపీ వాళ్లు అడ్డుపడడం బాధాకరం. గతంలో తిరుపతి ప్రజలకు తాగునీటిని అందించేందుకు మున్సిపాలిటీ డబ్బులతో కల్యాణిడ్యామ్ నిర్మించారు. అయితే రెండు పెద్దపైపులు ద్వారా కల్యాణిడ్యామ్ నీటిని టీటీడీ వాడుకుంటోంది. తిరుపతి కార్పొరేషన్‌కి టీటీడీ రూ.163 కోట్లు బకాయిలు ఉంది. తిరుపతి ప్రజల మనోభావాలు దెబ్బతినేలా బీజేపీ వ్యవహరిస్తోంది.

– అంజయ్య, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాదిరాష్ట్రాల అధ్యక్షుడు

నిధులు ఇవ్వొచ్చునని టీటీడీ చట్టాల్లోనే ఉంది



తిరుపతి అభివృద్ధికి 1శాతం నిధులు కేటాయించడంపై బీజేపీ అడ్డుపడడం దుర్మార్గం. శ్రీవారికి కానుకల ద్వారా వచ్చిన డబ్బులను ఎక్కడైనా ఖర్చు చేయవచ్చునని టీటీడీ చట్టాల్లోనే ఉంది. వేలూరు సీఎంసీ ఆసుపత్రి వారు అక్కడి కార్పొరేషన్ అభివృద్ధికి కోటానుకోట్లు ఇస్తున్నారు. అభివృద్ధికి అడ్డుపడడం బీజేపీ నైజం. స్విమ్స్ ఆసుపత్రిలో డాక్టర్లుగా హిందువులే ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. టీటీడీ ఉద్యోగులకు కరకంబాడి వద్ద ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు బీజేపీ అడ్డుపడింది.

– కందారపు మురళి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నగరం నుంచి బహిష్కరించాలి



తిరుపతిలో నివాసం ఉంటూ తిరుపతి నగరంలో జీవిస్తున్న ఎవ్వరైనా అభివృద్ధికి అడ్డుపడితే వారిని వెంటనే నగర బహిష్కరణ చేయాలి. రాజకీయాలకు అతీతంగా తిరుపతిని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిలను ప్రతి ఒక్కరు అభినందించక తప్పదు. టీటీడీ పాలకమండలి ఆమోదంతో 1శాతం నిధులను తిరుపతి అభివృద్ధికి కేటాయిస్తే వాటిని బీజేపీ నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటు.

– అజయ్‌కుమార్, వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర హీనులే...



తిరుపతి అభివృద్ధికి ఎవ్వరు అడ్డుపడినా చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. టీటీడీ 1శాతం నిధులతో తిరుపతి మరింత అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుపరుచుకో వచ్చుననుకున్నాం. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు రాకుండా అడ్డుపడిన బీజేపీ నాయకులు తిరుపతి ద్రోహులుగా మిగిలిపోతారు. టీటీడీ నిధులను తీసుకెళ్లి ఇతర రాష్ట్రాల్లో ఆలయాల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు వినియోగించినప్పుడు భానుప్రకాష్‌రెడ్డికి కనిపించలేదా. తిరుపతి అభివృద్ధికి పదిశాతం నిధులు కేటాయించినా తప్పులేదు.

– మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి

హైదరాబాదు తరహాలో తిరుపతి అభివృద్ధి



నిత్యం లక్షలాది మంది శ్రీవారి భక్తులతో తిరుపతి కిటకిటలాడుతుంటోంది. శ్రీవారి భక్తులకు తిరుపతిలో అన్ని వసతులు కల్పించాలంటే తిరుపతి హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు ఖర్చు చేస్తే తప్పేంటి? అభివృద్ధి పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగితే ప్రశ్నించాలే తప్ప అభివృద్ధికి అడ్డుపడడం బాధాకరం.

– ఆర్కాట్ కృష్ణప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు

టీటీడీలో టాస్క్‌ఫోర్స్ కమిటీ



గతంలోలా టీటీడీలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఆ కమిటీ ద్వారా టీటీడీ నిధులు ఎక్కడ, ఎలా ఖర్చుపెట్టాలో టాస్క్‌ఫోర్స్ నిర్ణయం తీసుకునేలా ఉండాలి. టీటీడీ ఈవో, చైర్మన్‌తోపాటు జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్, ఇతర ప్రభుత్వ అధికారులను టాస్క్‌ఫోర్స్ కమిటీలో నియమించాలి. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు ఎన్ని కోట్లు కేటాయించినా తక్కువే అవుతుంది.

– పురుషోత్తంరెడ్డి, రాయలసీమ మేధావుల ఫోరం అధ్యక్షుడు

తిరుపతి లేనిదే తిరుమల ఉందా?



తిరుపతి లేనిదే తిరుమల ఉందా? తిరుమల తిరుపతి దేవస్థానం అంటారే తప్ప తిరుమల దేవస్థానం అని అనరు. అలాంటప్పుడు టీటీడీలో భాగమైన తిరుపతికి టీటీడీ నిధులు ఖర్చు చేస్తే తప్పేమిటి. గతంలో తిరుపతికి చుట్టూ ఉన్న చెరువులు టీటీడీ నిర్వహణలో ఉండేవి. టీటీడీ నిధులు తిరుపతికే కాదు రాయలసీమ అభివృద్ధికి కేటాయించినా తప్పులేదు. టీటీడీ నిధులతో తిరుపతి అభివృద్ధే కాదు, మరిన్ని కళాశాలలు, ఆసుపత్రులు నిర్మించాలి. అందరి భాగస్వామ్యంతో టీటీడీ నుంచి తిరుపతికి మరిన్ని నిధులు తెచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఆదిమూలం శేఖర్, సీనియర్ జర్నలిస్ట్

సత్యసాయి ట్రస్ట్ నిధులతో పుట్టపర్తి అభివృద్ధి



శ్రీసత్యసాయి ట్రస్ట్ ద్వారా పుట్టపర్తిని అద్భుతంగా అభివృద్ధి చేయలేదా? కాశీలోని ఆలయానికి వచ్చే నిధులతో అక్కడ దేశ ప్రధాని నరేంద్రమోడీ అభివృద్ధి చేశారు. తిరుపతిలో 4.5లక్షల మంది జనాభా, రోజూ లక్ష మంది శ్రీవారి భక్తుల రాకపోకలు ఉన్న తిరుపతిలో కేవలం వెయ్యిమంది పారిశుధ్య పనులు చేయడం సాధ్యమేనా? రాజకీయ ప్రయోజనాల కోసమే టీటీడీ నిధులు ఖర్చు చేస్తున్నారని కొందరు రాద్ధాంతం చేయడం దుర్మార్గం. తిరుపతి కార్పొరేషన్, స్మార్ట్‌సిటీ నిధులతో తిరుపతిని పరిశుభ్రంగా ఉంచడం సాధ్యం కాదు.

– ఎస్. నగేష్, సీనియర్ జర్నలిస్ట్



తిరుపతి అభివృద్ధిపై నిర్వహించిన సమావేశానికి హాజరైన అఖిలపక్ష నేతలు, జర్నలిస్టులు, మేధావులు

ఆలయాల నిధులతోనే అభివృద్ధి



తిరుపతి తిరుమలను వేరు చేసి చూడగలమా? అలాంటప్పుడు టీటీడీ నిధులు తిరుపతికి ఖర్చు చేస్తే తప్పేమిటి. దేశంలోని ఆలయాల నిధులతోనే అనేక ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చేశారు. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు కేటయించకూడదనడాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలి. తిరుపతి పరిశుభ్రంగా ఉంటేనే నగర ప్రజలతో పాటు శ్రీవారి భక్తులు సైతం ఆరోగ్యంగా ఉండగలరు. – రవికుమార్, సీనియర్ జర్నలిస్ట్

ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుకను అందజేస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

పాకాల: ఉప్పరపల్లి పంచాయతీ మల్లెలచెరువు పల్లిలో నూతనంగా పెళ్లి చేసుకోబోతున్న వధూవరులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో పెళ్లి కానుకను అందజేశారు. మంగళవారం వైఎస్ఆర్ సీపీ నాయకులు చేతుల మీదుగా కాబోయే వధూవరులు కె.జయంతి, కె.ధనుంజయలుకు బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, భాసికాలు, పట్టు వస్త్రాలు, గాజులు, తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. పెళ్లి కానుక ఇవ్వడం చాలా సంతోషకరమని, మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, ఎంపీటీసీ సురేష్, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, నాయకులు మునిరత్నంరెడ్డి, అన్నాబాబురెడ్డి, నాగూర్, వనజ, పరదేశి, మస్తాన్, ప్రదీప్, సుబ్రమణ్యం, చిరంజీవి, రాజేష్, గిరి పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో...



వధువు తల్లిదండ్రులకు పెళ్లికానుక అందజేస్తున్న నాయకులు

రామచంద్రాపురం: మండలంలోని వెంకట్రామాపురం పంచాయతీ నెడ్డెంవారిపల్లి గ్రామంలో త్వరలో వివాహం చేసుకోనున్న వధువు దీపిక తల్లిదండ్రులు ఎల్లమ్మ, బాబులకు వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, చంద్రమౌళి, కోటి, ప్రతాప్‌లు మంగళవారం ఎమ్మెల్యే పెళ్లికానుక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో చంద్రగిరి నియోజకవర్గంలో వివాహం చేసుకోబోతున్న వధూవరులకు అమ్మవారి పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు, బంగారు తాళిబొట్టు, మెట్టెలు, వెండి భాసికాలు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందిస్తున్నట్లు తెలిపారు.

జన సంక్షేమమే పరమావధిగా జగనన్న పాలన

- ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి



13వ డివిజన్ సచివాలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజలు

తిరుపతి మంగళం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో ఎన్నికల సమయంలో వందల హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కేసే చంద్రబాబు లాంటి నాయకుడిని గతంలో చూశామని తెలిపారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు, మగాడు జగనన్న అని సగర్వంగా చెప్పారు. తిరుపతి 4, 13, 39 డివిజన్లలో మంగళవారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ముందుగా జగనన్న అందించిన సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించి, వైఎస్ఆర్ సీపీ జెండాను ఎగురవేశారు. దీంతో పాటు 4వ డివిజన్‌లో చిన్నారితో జగనన్న అందించిన సంక్షేమ పథకాల బోర్డును ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలోనే ఇంతవరకు ఏ నాయకుడికి సాధ్యం కానన్ని సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. తిరుపతి నియోజకవర్గంలోనే రూ.1600కోట్లతో హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయగలిగామంటే జగనన్న సహకారంతోనేన్నారు. నగరంలో 18మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీలెఫ్ట్ రోడ్లను తీసుకొచ్చి స్వర్గధామంగా మార్చామన్నారు. ఇరవయ్యేళ్లుగా సాధ్యం కాని టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల మంజూరు సీఎం జగనన్న సహకారంతోనే సాధ్యమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నను తిరిగి గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు పొందవచ్చునన్నారు. వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పడమటి కుమార్, కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, పునీత, కో-ఆప్షన్ సభ్యురాలు శ్రీదేవి, జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కడపగుంట అమరనాథ్, కోటూరు శశి, బొగ్గుల వెంకటేష్, అరుణ్‌కుమార్, శెట్టిపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

అవిలాలలో కాలువ కబ్జాపై రెవెన్యూ కన్నెర్ర



అవిలాలలో కాలువపై ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తిరుపతి రూరల్: అవిలాల పంచాయతీ పరిధిలో కాలువ కబ్జాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. పంచాయతీలోని సుబ్బయ్యకాలనీలో సర్వే నెంబర్ 25లో ఉన్న కాలువను ఆక్రమించి రైల్వే ఉద్యోగి అక్రమంగా షెడ్డులను నిర్మించాడు. దానికి కరెంటు మీటరు కూడా తీసుకున్నాడు. రైల్వే ఉద్యోగి ఆక్రమణలపై స్థానికులు తిరుపతి రూరల్ తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యంకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలను పరిశీలించిన ఆయన వాటిని తొలగించాలని ఆర్ఐ శివకుమార్, వీఆర్వో దివ్యను ఆదేశించారు. తహసీల్దార్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది మంగళవారం ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువను ఆక్రమించి నిర్మించిన షెడ్డులను తొలగించారు. కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం హెచ్చరించారు.

గాయపడ్డ కానిస్టేబుల్‌కు తుడా చైర్మన్ పరామర్శ

- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



కానిస్టేబుల్ గిరిబాబును పరామర్శిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



వైద్యాధికారుల వద్ద ఆరా తీస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రామచంద్రాపురం మండలం నెత్త కుప్పం పంచాయతీ.. ఎల్వీపురానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ గిరిబాబును తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిబాబుకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు తుడా చైర్మన్ సూచించారు. గిరిబాబు తండ్రి, వైఎస్ఆర్ సీపీ నాయకుడు సుధాకర్ రెడ్డి, కుటుంబ సభ్యులను మోహిత్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. తిరుపతి క్రైంబ్రాంచ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గిరిబాబు సోమవారం రాత్రి బైక్‌లో వెళుతూ మండపంపల్లి వద్ద ప్రమాదానికి గురయ్యారు. మోహిత్‌రెడ్డి వెంట కొత్తవేప కుప్పం సర్పంచ్ హిమాల్ రెడ్డి ఉన్నారు.

వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులకు..

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయపడిన చంద్రగిరి మండలం చిన్నరామాపురానికి చెందిన వైఎస్ఆర్ సీపీ కార్యకర్త వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. స్విమ్స్ వైద్యులు న్యూరాలజీ అత్యవసరం విభాగంలో వెంటిలేటర్‌పై వైద్య సేవలు అందిస్తున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను కోరారు. ధైర్యంగా ఉండాలంటూ కుటుంబ సభ్యులకు సూచించారు. చిన్నరామాపురం మాజీ సర్పంచ్ ఏకాంబరం సమీప బంధువు, వైఎస్ఆర్ సీపీ కార్యకర్త వినోద్‌కుమార్ అని వైద్యులకు మోహిత్‌రెడ్డి తెలిపారు. ఏ అవసరమొచ్చినా తానున్నానంటూ ధైర్యం చెప్పారు.